## ఆకట్టుకుంటున్నాయి

గీటురాయిలో ఆర్టికల్స్ బాగున్నాయి. ముఖ్యంగా 'ప్రవక్త(స) సాదా జీవనవిధానం'లో నేటి సమాజం అనవసరమైన వాటికి అధిక ఖర్చు చేస్తూ, అవసరమైన వాటిని పట్టించుకోకుండా వుండడం చదివి చాలా బాధ కలిగింది. ఈ ఆర్టికల్ చదివాక నైనా అనవసరమైన ఆడంబరాలకు పోకుండా మారుతారని ఆశిస్తున్నాను. ఇంకా 'ఆరోగ్యం- అలవాట్లు'లో తెలుసుకోవా ల్సిన చాలా అంశాలను వివరించారు. మిగతా అన్ని ఆర్టికల్స్ కూడా చాలా బాగుంటున్నాయి. 'చదువే కాదు! క్రమశిక్షణా కావాలి'లో పిల్లల పట్ల తల్లిదండ్రుల బాధ్యతలను చక్కగా వివరించారు. ఇన్ని మంచి అంశాలతో పత్రికను వారంవారం సర్వాంగ సుందరంగా అందిస్తున్నందుకు కృతజ్ఞతలు.

**- ఎం.డి. రాజ్ ముహమ్మద్, కరీంనగర్**

## ప్రోత్సహించాలి

జూన్11 సంచిక చాలా బాగుంది. కవరు కథనం ప్రభుత్వానికి కనువిప్పు కలిగించేలా చాలా చక్కగా వివరించారు. 'ఆయెషా మీరా మాటేంటి...?' అని సంపాదకీయం వాస్తవాలను వివరించింది. శాస్త్రీయ ప్రగతిలో ఇరాన్, టర్కీ ముందంజలో ఉన్నాయనే వ్యాసం ఎంతో విజ్ఞానాన్ని పెంచింది. గతంలో కంటే 'గీటురాయి'లో వ్యాసాలు బాగుంటున్నాయి. కవితా కవాతులోని కవితలు మమ్మల్ని ఎంతో ఆకట్టుకుంటున్నాయి. ప్రతివారం పత్రికలో కవితలకు స్థానం కల్పించాలి. కొత్త రచయితలకు ప్రాధాన్యమిస్తే మరెన్నో మంచి రచనలు వచ్చే ఆస్కారముంది. పాత రచయితల వ్యాసాలనే వారం వారం ప్రచురించేకంటే కొత్తవారి రచనలు ప్రచురించడం వల్ల వారిని ప్రోత్సహించినట్లవుతుంది. **- ఎం.డి. హాజిరా, ఖమ్మం**

## ఆకర్షణీయంగా ఉంది

ఇటీవల వెలువడుతున్న గీటురాయి వార పత్రిక చాలా అందంగా విజ్ఞానదాయకంగా ఉంటున్నది. సంచికలోని వ్యాసాలన్నీ చదువరులను ఆకట్టుకుంటున్నాయి. సమాధా నాల శీర్షికను ప్రారంభించండి ప్లీజ్!

**- అనస్, హైదరాబాద్**

## చాలా విషయాలు తెలుస్తున్నాయి

గీటురాయి వారపత్రిక ద్వారా ధార్మిక విషయాలు, సామాజిక, రాజకీయ విషయాలు ఎన్నో తెలుస్తు న్నాయి. జమ్మూలో ఇస్లామీయ ఛానెళ్ళ నిషేధం గీటురాయి ద్వారానే తెలుసుకున్నాము. ముస్లింలను టార్గెట్ చేసుకొనే ఈ ఛానెళ్ళను నిషేధించడం చాలా సిగ్గుచేటు. జనాబ్ ఎం.ఎం బేగ్ గారు పరమపదించా రని గీటురాయి ద్వారా తెలుసు కున్నాము. అల్లాహ్ వారికి పరలోక సాఫల్యం ప్రసాదిం చుగాక! మగువ మేల్కొలుపులో 'స్త్రీల సుగుణాలు' నసీరా బేగం ఖుర్ఆన్, హదీసుల్లో చాలా చక్కగా వివరించారు. 'మహిళలు- ఉపాధి' వ్యాసం చాలా బాగుంది. ఈ రోజు లలో మహిళలు ముందుకు దూసుకుపోతున్నారు. కాని ముస్లిం మహిళలే వెనుకబడి పోతున్నారని చెప్పవచ్చు. ముహమ్మద్ ప్రవక్త(స) పురుషులతోపాటు స్త్రీలకు సమాన హక్కులు కల్పించారు. వారు కూడా ఇస్లాం పద్ధతులను పాటిస్తూ ఉపాధి పనులు, ఉద్యోగాలు చేసుకోవచ్చు. పరుల పాపాల్ని బహిర్గతం చేయకండి. అబుల్ ఫౌజాన్ గారు, 'ఎంతో అమూల్యమైనవి కళ్ళు' గౌస్‌ఖాన్ గారు, 'సత్కర్మలతోనే స్వర్గధామం' పి.మహబూబ్ ఖాన్ చాలా చక్కగా వివరించి చెబుతున్నారు. 'సందేహాలు- సమాధా నాలు' శీర్షిక పునఃప్రారంభించాలని నిర్ణయించడం చాలా సంతోషకరం. దీని ద్వారా ఎంతో మంది సందేహాలు తీరుతాయి. **- ముహమ్మద్ వహీదుద్దీన్, మెదక్**

## న్యాయం దక్కకపోవడం శోచనీయం

భారతదేశంలో బలమైన చట్టాలు, ప్రజాప్రాతినిధ్యవ్యవస్థ, క్రియాశీల న్యాయవ్యవస్థ ఉన్నప్పటికీ భోపాల్ బాధితులకు న్యాయం దక్కకపోవడం తీవ్ర శోచనీయం. బాధితులకు తగిన పరిహారం కూడా అందకపోవడం దురదృష్టం. ఇన్ని దురాగతాలు జరిగినా ప్రభుత్వం ఏమీ పట్టనట్టు ఉంటోంది. భోపాల్ దుర్ఘటనను గుణపాఠంగా తీసుకుని అణుప్రమాద పరిహార బాధ్యతా బిల్లుపై ప్రభుత్వం పునరాలోచించాలి. **- షేక్ హసన్, లంకపల్లి, ఖమ్మం జిల్లా**

## ఆలోచనాత్మకంగా ఉంది

ఇబ్నె అలీ గారి 'డియర్ పేరెంట్స్....' వ్యాసం ఎంతో ఆలోచనాత్మకంగా ఉంది. ఎన్నో విషయాలు తెలిజేశారు. వారికి మా ధన్యవాదాలు. **- మేరాజ్, వరంగల్లు**